క్లుప్తంగా

బీఆర్‌ఎస్ తెలంగాణకు శ్రీరామ రక్ష

● మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణకు శ్రీరామ రక్ష అని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసిన ప్రజలకు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహించిన పార్టీ శ్రేణులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్యకర్తకు గులాబీ జెండా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

దేవరకొండ: దేవరకొండ నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని మంగళవారం ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు కామోజు విజయ్, సలహాదారుడు కుడిదాల కృష్ణయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా నేలపట్ల వాసుదేవ్, ఉపాధ్యక్షులుగా జాజాల తిరుపతయ్య, గోలి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కానుగుల మధు, కోశాధికారిగా వెలిజాల సురేష్, కార్యదర్శులుగా గోలి శ్రీను, కుడిదాల ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికల వాసుదేవ్ మాట్లాడుతూ గత పాలకవర్గం సలహాలతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించారు.

కష్టపడిన కార్యకర్తలకు ధన్యవాదాలు : మల్లయ్య

మాడుగులపల్లి : నల్లగొండ లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడ్డ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. నల్లగొండ ఎంపీగా కుందూరు రఘువీర్‌రెడ్డి 3లక్షలకుపైగా మెజార్టీతో విజయం సాధించబోతున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రఘువీర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ అహర్నిశలు శ్రమించిన కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన మాట నిలుపుకుంటుందని పేర్కొన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని, రాహుల్ గాంధీ ప్రధాని కాబోతున్నారని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

హాలియా : అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కట్ల సాయిరాం గకొద్ది రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న దాతృత ఫౌండేషన్ చైర్మన్ కాంసాని వెంకట్‌రెడ్డి మంగళవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించాడు. వైద్య ఖర్చుల నిమిత్తం బాధితుడికి రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో చలమల వెంకట్‌రెడ్డి, పాతనబోయిన సురేష్, అలుగుల కృష్ణారెడ్డి, మారుపాక మల్లిఖార్జున్ గౌడ్, అయితగోని సతీష్, అనుముల ప్రశాంత్, సుబ్బు, సైదులు, అనిల్, రాకేష్, అశోక్, నాగరాజు తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిన ఈవీఎంలు



దేవరకొండ నుంచి ఈవీఎంలను నల్లగొండకు తరలిస్తున్న అధికారులు

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఈవీఎంలను మంగళవారం ఉదయం పోలీసు భద్రత నడుమ ప్రత్యేక వాహనాల్లో నల్లగొండలోని దుప్పలపల్లిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ప్రత్యేక అధికారులు నటరాజన్, ఆర్డీఓ శ్రీరాములు, రాజ్‌కుమార్‌ల పర్యవేక్షణలో దేవరకొండలోని డీఆర్‌సీ కేంద్రం నుంచి ఈవీఎంలను ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో నల్లగొండకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



కొండమల్లేపల్లి : విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని చిన్నఅడిశర్లపల్లిలో చోటు చేసుకుంది. చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన రైతు కూర లింగయ్య మంగళవారం తనకున్న నాలుగు పశువులను మేత కోసం తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మేత మేస్తున్న ఆవుకు పక్కనే ఉన్న కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

గ్రీన్‌మ్యాట్స్‌తో మొక్కల సంరక్షణ

- నర్సరీల్లో చలువ పందిళ్ల ఏర్పాటు
- ప్రతీరోజు నీటిని అందిస్తున్న వనసేవకులు
- రూ.6 నుంచి 10వేల నిధుల కేటాయింపు
- పెద్దవూర మండల వ్యాప్తంగా 3.90 లక్షల మొక్కల పెంపకం



బట్టుగూడెంలో ఏర్పాటు చేసిన చలువ పందిరి



మొక్కలకు నీటి తడులు వేస్తున్న సంరక్షకుడు

పెద్దవూర: పదో విడత హరితహారానికి గ్రామాల్లోని నర్సరీల్లో పంచాయతీ సిబ్బంది మొక్కలు పెంచుతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున మొలకెత్తిన విత్తనాలు, మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారు. పండ్లు, పూలు, నీడ నిచ్చే మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలను నాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. పెద్దవూర మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో నర్సరీలను ఏర్పాటు చేసి వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపడుతున్నారు. మొక్కల పెంపకంలో భాగంగా కవర్లలో విత్తనాలు నాటగా, మొక్కలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. మొక్కలు ఎండిపోకుండా ప్రతీరోజు నీటి తడులు అందిస్తున్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై చలువ పందిళ్లను(గ్రీన్ మ్యాట్స్) రక్షణ కోసం వేయిస్తున్నారు. చలువ పందిళ్ల కోసం ప్రభుత్వం మొక్కల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో నర్సరీకి రూ.6 వేల నుంచి రూ.10వేల వరకు నిధులు కేటాయించింది.

సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ..

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రతీ నర్సరీలో జీవామృతం తయారు చేయిస్తున్నారు. మొక్కలు చనిపోకుండా ఆరోగ్యంగా ఉండేందుకు గాను సేంద్రియ ఎరువులను వినియోగిస్తున్నారు. ఎండ తీవ్రత కోసం నర్సరీల పైభాగాన చలువ పందిళ్లు వేయించారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో మొక్కలు వాడిపోకుండా పంచాయతీ సిబ్బందితో ట్యాంకర్లతో నీటిని పోయిస్తున్నారు.

ఒక్కో నర్సరీలో 15వేల చొప్పున..

వర్షాలు సమృద్ధిగా కురవాలని, వాతావరణ సమతుల్యత కాపాడేందుకు, పల్లెలు పచ్చదనంతో ఉండాలన్న లక్ష్యంతో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 26 నర్సరీలను ఏర్పాటు చేశారు. పదో విడత హరితహారంలో భాగంగా ఒక్కో నర్సరీలో 15వేల చొప్పున మండలంలో మొత్తం 3.90లక్షల మొక్కలను నాటే లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించారు. ప్రతీ గ్రామంలో మొక్కల సంరక్షణకు వనసేవకుడిని నియమించారు. వీరు నర్సరీల్లో విత్తనాలు వేసిన మొదలు మొక్కలుగా ఎదిగే వరకు చర్యలు తీసుకుంటున్నారు. మొక్కల మధ్య పెరిగిన కలుపును ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో మొలకెత్తని విత్తనాలను తొలగించి ఇతర మొక్కలు పెంచుతున్నారు. అందులో భాగంగా పండ్లు, పూలు, నీడనిచ్చే తదితర మొక్కలను పెంచుతున్నారు.

మొక్కలను సంరక్షించాలి

వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేయించాం. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రతీ ఒక్కరూ హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలి.

– వర్కాల మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ, పెద్దవూర

‘దేవరకొండ’లో 70.60శాతం పోలింగ్



దేవరకొండ మండలం తాటికోల్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

దేవరకొండ: నల్లగొండ పార్లమెంట్ ఎన్నికలు సోమవారం దేవరకొండ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 2,62,480 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,31,838మంది పురుషులు,1,30,624మంది మహిళా ఓటర్లు, ఇతరులు 18మంది ఉన్నారు.సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 1,85.310 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా వీరిలో 94,896మంది పురుషులు,90,405మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులు 9మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.దీంతో నియోజకవర్గంలో 70.60శాతం పోలింగ్ నమోదైంది.గత సాధారణ ఎన్నికల్లో 84.49శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుతం దాదాపు 14శాతం మేర తక్కువ పోలింగ్ నమోదైంది.

అత్యధికంగా చింతపల్లిలో...

పార్లమెంట్ ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని చింతపల్లి మండలంలో అత్యధికంగా 76.74 శాతం పోలింగ్ నమోదు కాగా కొండమల్లేపల్లిలో అత్యల్పంగా 67.70శాతం నమోదైంది.చింతపల్లి మండలంలో 43,774మంది ఓటర్లు ఉండగా వీరిలో 21,806 మంది పురుషులు,21966మంది మహిళలు,ఇద్దరు ఇతరులు ఉన్నారు. 17,103 మంది పరుషులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 16,489మంది మహిళలు ఓటు వేశారు. కొండమల్లేపల్లిలో 29,165మంది ఓటర్లు ఉండగా వీరిలో 14,795మంది పురుషులు, 14,367 మంది మహిళలు,ఇతరులు ముగ్గురు ఉన్నారు.కాగా 10,083మంది పురుషులు, 9,661 మంది మహిళలు ఓటు వేశారు.

మండలం	మొత్తంఓట్లు	పోలైనఓట్లు	పోలింగ్‌శాతం
చింతపల్లి	43,774	33,592	76.74
దేవరకొండ	58,269	40,429	69.38
కొండమల్లేపల్లి	29,165	19,744	67.70
గుండ్లపలి	41,632	28,223	67.79
నేరేడుగొమ్ము	20,024	14,077	70.30
చందంపేట	30,235	20,558	67.99
పీఏపల్లి	39,381	28,687	72.84

ఓటేసింది 1,76,190 మందే !

- ‘సాగర్’లో ఓటర్లు 2,36,484 మంది
- నియోజకవర్గ వ్యాప్తంగా 74.50 శాతం పోలింగ్ నమోదు



హాలియా: ఓటేసేందుకు బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

హాలియా : నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నాగార్జున సాగర్ నియోజకవర్గంలో 1,76,190 మంది ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,36,484 మంది ఓటర్లు ఉండగా వారిలో 1,15852 మంది పురుషులు, 1,20,611 మంది స్త్రీలు, ఇతరులు 21 మంది ఉన్నారు సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 1,76,190 మంది ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును సద్వినియోగం చేస్తున్నారు. వీరిలో 87,949 మంది పురుషులు కాగా 88231 మంది మహిళలు, ఇతరులు 10 మంది ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 74.50 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. నియోజకవర్గంలో అత్యధికంగా మాడుగులపల్లి మండలంలో 86.39 శాతం పోలింగ్ నమోదు కాగా పెద్దవూర మండలంలో అత్యల్పంగా 67.80 శాతం పోలింగ్ నమోదైంది. మాడుగులపల్లి మండలంలో 7710 మంది ఓటర్లు ఉండగా వీరిలో 3339 మంది పురుషులు, 3322 మంది స్త్రీలు ఉన్నారు. కాగా 6661 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దవూర మండలంలో మొత్తం ఓటర్లు 47,283 మంది ఉండగా వీరిలో 15,949 మంది పురుషులు, 16109 మంది స్త్రీలు ఇతరులు ఇద్దరు ఉన్నారు. 27879 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

మండలం	మొత్తంఓట్లు	పోలైనఓట్లు	పోలింగ్‌శాతం
అనుముల	36,245	27,198	75.04
గుర్రంపోడు	38255	29456	77.00
మాడుగులపల్లి	7710	6661	86.39
నిడమనూరు	35820	27879	77.83
పెద్దవూర	47283	32060	67.80
తిరుమలగిరి(సాగర్)	34910	25315	72.52
త్రిపురారం	36261	27621	76.17

రహదారిపై దుర్గంధం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సంజీవని ట్రస్ట్ ఎదురుగా ఉన్న ఓ పార్ బాయిల్డ్ రైస్ మిల్లు నుంచి వ్యర్థ జలాలను విడుదల చేస్తున్నారు. అవి జడ్చర్ల – కోదాడ రహదారిని తాకుతున్నాయి. వ్యర్థ జలాలతో విపరీతమైన దుర్గంధం వెలజల్లుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలువురు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయమై ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లగా తహసీల్దార్ చర్యలు తీసుకుంటారని వివరణ ఇచ్చారు.



రహదారిపై నిలిచిన మురుగు నీరు

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితుడు



పాల్గొన్న మహిళా భక్తులు

హాలియా : అనుముల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి 21వ వార్షికోత్సవంలో భాగంగా శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం మంగళవారం భక్తుల కోలాహలం మధ్య కనుల పండవగా జరిగింది. అర్చకులు బ్రహ్మశ్రీ గొట్టిముక్కల నర్సింహ్మాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, మండపా రాధన, విఘేశ్వర పూజ, పూర్ణాహుతి, అభిషేకం, రుద్రాభిషేకం, హోమాలు నిర్వహించిన అనంతరం స్వామి వారి కల్యాణాన్ని వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టిపోలు వెంకన్న, అలుగుల బ్రహ్మానందరెడ్డి, పంగ వెంకటేశ్వర్లు, పాతనబోయిన సురేష్, పిల్లి శ్రీను, కృష్ణమాచారి, మేకల పరమేష్, లింగయ్య, పంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

నిడమనూరు : మండలంలోని రాజన్నగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎదుల్ల నరసింహారెడ్డిని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మంగళవారం పరామర్శించారు. షుగర్ వ్యాధి కారణంగా నరసింహారెడ్డి మోకాలి కింది భాగం వరకు శస్త్రచికిత్స చేసి తొలగించారు. సమాచారం తెలుసుకున్న జానా రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నందికొండ రాజేశ్వరి మట్టారెడ్డి, యడవెల్లి రంగసాయి రెడ్డి, అంకతి సత్యం, మేరెడ్డి వెంవకట్ రాహుల్, ముంగి జ్యోతి, శివ, మారయ్య, ఎంపీటీసీ లక్ష్మీ వెంకట్ రెడ్డి, యాదుల్ల పద్మ వెంకటరమణ, సైదయ్య నాయుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు మేకలు మృతి

నాంపల్లి: నాంపల్లి మండలంలోని రాజ్యానాయక్ తండా పరిధి బాల్యతండాలో రమావత్ కామ్లాకు చెందిన రెండు మేకలు మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో మంగళవారం సాయంత్రం వీచిన గాలి దుమారానికి విద్యుత్ తీగలు తెగి పడడంతో అక్కడే ఉన్న మేకలు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. దాదాపు రూ.35 వేలకుపైగా నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. విద్యుత్ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని బాధితుడు కామ్లా కోరాడు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నెల్లిబండ గుట్టపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : నెల్లబండ గుట్టపై జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపడతానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలం నెల్లిబండలో ఈ నెల 19 నుంచి జాతర జరగనున్న నేపథ్యంలో మంగళవారం ఆయన గుట్టను సందర్శించారు. జాతర ఏర్పాట్లపై దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ పాలకవర్గంతో సమీక్ష నిర్వహించారు. జాతరకు మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గుట్టపైన మిషన్ భగీరథ ట్యాంకు ఉన్నందున భక్తులకు ఈ ట్యాంకు నుంచి మంచినీటిని సరఫరా చేయాలని సంబంధిత డీఈని ఆదేశించారు. విద్యుత్ వెలుగుల కోసం 40 లైట్లు వెంటనే ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. మళ్లీ రెండేళ్ల తరువాత వచ్చే జాతర నాటికి గుట్టపైకి రోడ్డు, గుట్ట చుట్టూ ఫెన్సింగ్, గుట్టపైన ఆలయాల పునర్నిర్మాణం, కోనేరు విస్తరణ పనుల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఆయన వెంట దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మీ, మేనేజర్ వెంకటేషం, ఆలయ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ యానాల శేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు బాత్క లింగస్వామి, ఆడేపు సతీష్, బోయిళ్ల అశ్విన్, గుడుగుంట్ల శివశంకర్ ఉన్నారు.

పూర్తయిన వేలం పాటలు

నెల్లిబండ జాతరలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించడం, తలనీలాలు సేకరించేందుకు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మీ, ఆలయ చైర్మన్ యానాల యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించేందుకు రూ.58000, తైబజార్‌కు రూ.10 వేలు, లడ్డూ మిఠాయి, ప్రసాదం అమ్మేందుకు రూ.9 వేల చొప్పున వేలం పాటలు ఖరారయ్యాయి.

ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, ప్రధాన కార్యదర్శి పెరుమాల్ల సైదులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లాఠీచార్జ్ చేసిన పోలీసులను కూడా సస్పెండ్ చేయాలన్నారు.

జూదరుల అరెస్ట్

నిడమనూరు : మండలంలోని గుంటకగూడెం అవుట్ స్పాట్ వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి 9మంది జూదరులను మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.23 వేలు, 8 సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసున్నామని ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు. పట్టుబడిన వారు నిడమనూరు, గుంటకగూడెం, ముప్పారం, అలీనగర్‌కు చెందిన వారని పేర్కొన్నారు.

● ఉల్టాగా ఊరి పేరు !



మాడుగులపల్లి : మాడుగులపల్లి మండలం ఆగమోత్కూర్ శివారులో ఆర్‌అండ్‌బీ శాఖ ఏర్పాటు చేసిన నేమ్ బోర్డు తలకిందులైంది. వాహనదారులకు సమాచారం తెలిసేలా పెట్టిన బోర్డు తలకిందులుగా ఉండడంతో అటుగా వెళ్లేవారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన బోర్డు ఇలా నెలలుగా ఉల్టాగా ఉంటున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే బోర్డును సరిచేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

వానర మూకతో బెంబేలు !

- డిండిలో గుంపులుగా సంచారం
- ఇళ్లలోకి చొరబడి నిత్యావసరాలను ఎత్తుకెళ్తున్న కోతులు
- అడ్డువచ్చిన ప్రజలపై దాడులు
- నివారణ చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి



డిండి పట్టణంలో సంచరిస్తున్న కోతులు

డిండి: వానర మూకతో డిండి పట్టణ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. గుంపులు.. గుంపులుగా సంచరిస్తూ ఇళ్లలోకి చొరబడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. నిత్యావసర వస్తువులను ఎత్తుకెళ్తూ.. అడ్డు వచ్చిన మహిళలు, పిల్లలపై దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

రాత్రి, పగలు తేడా లేకుండా..

డిండి పట్టణంలో కోతులు ఇంటి పైకప్పు,చెట్లు,ప్రహరీ గోడలపై నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా సంచరిస్తున్నాయి. అంతేకాకుండా వాటి ఆహారం కోసం ఇంటి లోపలికి వచ్చి వస్తువులను తీసుకెళ్తున్నాయి. పెరటిలో చెట్లకు కాసిన కూరగాయాలు, పండ్లను ధ్వంసం చేస్తున్నాయి. ఆహారం కోసం గ్రామస్తులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నాయి. నిత్యవసరాల నిమిత్తం మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఇంటిలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. కోతుల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదును ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, సబంధిత అధికారులు వెంటనే స్పందించి కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



కోతులు నిత్యం ఇంటిట్టూ తిరుగుతున్నాయి. వాటి ఆహారం కోసం ఇంటిలోపలికి వచ్చి వస్తువులను తీసుకెళ్తున్నాయి. అడ్డుగా పోతే గాయపరుస్తున్నాయి. విషయాన్ని పలుమార్లు ప్రజాప్రతినిధులు,అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

–బి.కవిత గృహిణి, డిండి

నివారణ చర్యలు చేపడతాం



డిండి పట్టణంలో కోతుల సమస్య ఉన్న మాట వాస్తవమే. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించాం. వారి ఆదేశాల మేరకు కోతులను బెడద నివారణకు చర్యలు చేపడతాం.

– ఎస్‌డి. దానియల్ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ, డిండి

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలలో ప్రతి గ్రూప్‌లో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముళ్లపొదల్లో వేగ నియంత్రణ బోర్డు



చెట్లు ఏపుగా పెరగడంతో కనిపించని వేగ నియంత్రణ బోర్డు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలో విస్తరించి ఉన్న హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చెట్లు ఏపుగా పెరగడంతో వేగ నియంత్రణ బోర్డు కనిపించడం లేదు. రాష్ట్ర రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే చాలా చోట్ల చెట్ల కొమ్మలు పెరగడంతో బోర్డు వాహనదారులకు కనిపించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి వేగ నియంత్రణ బోర్డులు వాహనదారులకు కనిపించేలా తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సీపీఎం నాయకుడిపై దాడిచేసిన వారిని శిక్షించాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఎం, కాంగ్రెస్ నాయకులు

నేరేడుచర్ల : సీపీఎం నాయకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో జరిగిన కాంగ్రెస్, సీపీఎం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంచికల్‌దిన్న గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు జిడిమెట్ల రవిపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి దాడి చేసి గాయపరిచారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, నాగరాజు, భార్గవ సైదులు, శ్రీధర్, నాగేశ్వర్‌రావు, హరిబాబు, లక్ష్మీనర్సిహులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో మంగళవారం క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, క్షేత్రపాలకుడికి పంచామృతాలతో అభిషేకం, ఆకుపూజ, అష్టోత్తర శతనామావళి, సహస్రనామ ఫల పుష్పార్చన, గోత్రనామార్చన, ఆరగింపు, మంగళాశాసనం, పాశుర ఉచ్చరణ, తీర్థప్రగోష్టి వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

● కల్వర్టు గోడ ఎత్తు పెంచరూ..



దేవునిగోపాలపురం శివారులో రోడ్డుకు సమాంతరంగా ఉన్న కల్వర్టు

మాడుగులపల్లి : మండలంలోని మాచనపల్లి–కన్నెకల్లు రోడ్డులో దేవునిగోపాలపురం శివారులో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. దేవునిగోపాలపురం శివారు లోతట్టు ప్రాంతం నుంచి దిగువ కన్నెకల్లు నాగుల చెరువులోకి నీరు వెళ్లేలా రహదారి మధ్య నుంచి గూనలు వేసి కల్వర్టు నిర్మించారు. కల్వర్టు రోడ్డుకు సమాతరంగా ఉండడం.. సూచిక బోర్డు లేకపోవడంతో రాత్రివేళ ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనాలు కల్వర్టులో పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. నిత్యం ఈ రోడ్డు గుండా వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి కల్వర్టు గోడ ఎత్తుగా నిర్మించాలని, ఇరువైపులా సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.